
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.8 : కనిష్ఠం 28.5







టీయూ ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ సుల్తానియా


సందీప్‌కుమార్ సుల్తానియా

నిజామాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొత్త వీసీని ఎంపిక చేసేంతవరకూ ఆయనే ఇన్‌చార్జి వీసీగా కొనసాగనున్నారు. గత సంవత్సరం కాలంగా ఇన్‌చార్జి వీసీగా పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశంను ప్రభుత్వం జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా నియమించింది. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సందీప్‌కుమార్ సుల్తానియాను నియమించారు. టీయూ వీసీ రవీందర్ గుప్త ఏసీబీకి పట్టుబడిన తర్వాత బుర్ర వెంకటేశంను ఇన్‌చార్జి వీసీగా నియమించారు. అప్పటి నుంచి ఆయన్నే కొనసాగుతున్నారు. ఒక దఫా విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన పరిశీలించి వెళ్లారు. హైదరాబాద్ నుంచే విశ్వవిద్యాలయం కార్యకలాపాలను సమీక్షిస్తూ కొనసాగే విధంగా చూశారు. కొత్తగా నియమితులైన ఇన్‌చార్జి వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన ఈ బాధ్యతలను వెంటనే చేపట్టనున్నారు.

ముగిసిన వీసీల పదవీకాలం

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వీసీల పదవీకాలం మంగళవారంతో ముగిసింది. మూడేళ్ల కోసం మే 21, 2021లో ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాలకు ఈ వీసీల నియామకాలను చేపట్టింది. కొత్త వీసీల నియామకం కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. ఎన్నికల కోడ్ ఉండటం సెర్చ్ కమిటీలను నియమించింది. అయితే ఇంకా సమావేశం ప్రారంభించకపోవడం వల్ల వీసీల పదవీకాలం ముగియడంతో రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించింది. ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీలను నియమించిన యూజీసీ నామినీతో పాటు ఇతర సభ్యులు కూడా ఇంకా సమయం ఇవ్వకపోవడం వల్ల నియామకం ఆలస్యం అవుతోంది. ఒకటి రెండు వారాల్లో సెర్చ్ కమిటీలు సమావేశమై వీసీల కోసం చేసిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. వాటిలో అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు. సెర్చ్ కమిటీ సమావేశం తర్వాత సిఫారసు చేసిన ముగ్గురు వివరాలను గవర్నర్‌కు పంపించాలి. అందులో ఒకరిని వీసీగా నియామకం చేయనున్నారు. ఈ ప్రక్రియ అంతా కొంత ఆలస్యం కానుండటంతో విశ్వవిద్యాలయాల్లో పాలనకు ఇబ్బంది ఎదురు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీల నియామకం చేపట్టింది.

పల్లెల్లో.. 'పంచాయతీ' సందడి



- గ్రామపంచాయతీ ఎన్నికలపై జోరుగా చర్చలు
- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల మార్పుపై ఊహాగానాలు
- ఉప ఎన్నికలు లేకుండానే పంచాయతీ ఎన్నికలు
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ
- జిల్లాలో మొదలైన దావత్‌ల పర్వం

భీమ్‌గల్ రూరల్, మే 21: జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో అందరిచూపు సర్పంచ్ ఎన్నికలపై పడింది. ఇప్పటి వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకోసం పనిచేసిన గ్రామస్థాయి నేతలు చాలా మంది ఈ సారి సర్పంచ్ లేదా, ఎంపీటీసీగానో పోటీ చేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. దీంతో ఆశావహులు గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారం, పది రోజులుగా గ్రామాల్లో పలుకుబడి ఉన్నవారికి దావత్‌లు ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల్లో సత్తాచాటాలన్న ఉత్సాహంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడనప్పటికీ ఆశావహులు మాత్రం ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ముగియడం, జూన్ 4 ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపై పడింది. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన వారిలో కొందరు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల బరిలో నిలబడడానికి స్వదేశానికి రావడానికి సిద్ధం అవుతున్నారు. ఆశావహుల్లో మాత్రం పంచాయతీ రిజర్వేషన్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత ప్రభుత్వం అమలు చేసిన పదేళ్ల కాలానికి సంబంధించి రిజర్వేషన్లకు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు స్వస్తి పలకబోతుందని ప్రచారం పల్లెల్లో జోరుగా ఊపందుకుంది. 2019నాటి రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారా? వాటి స్థానంలో కొత్తగా మారుస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది. రిజరేషన్లు పదేళ్ల వరకు వర్తిస్తాయని నాడు చెప్పడంతో.. చాలా చోట్ల కొత్తగా వచ్చిన ఆశావహులు సర్పంచ్ పీఠమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇన్ని రోజులు సర్పంచ్ పీఠంపై కన్నేసిన నాయకులు.. రిజర్వేషన్లు మారితే అనుకూలమా? వ్యతిరేకమా? అనే టెన్షన్‌లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఏడాది జనవరి నెలలోనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని భావించినప్పటికీ.. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రస్తుతం ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించిందని సమాచారం. ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని పట్టుదలతో ఉంటే.. గత వైభవాన్ని కొనసాగించాలని బీఆర్‌ఎస్ తహతహలాడుతోంది.. బీజేపీ శ్రేణుల్లో కూడా ఉత్సాహం కనిపిస్తోంది. భీమ్‌గల్ మండలంలోని 27 గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ ఎన్నికల కోలాహలం ఇప్పటినుంచే కనిపిస్తోంది.

> మొన్నటి వరకు గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల హడావిడిలో మునిగితేలిన నాయకులు ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చనే చర్చలు గ్రామాల్లో ఊపందుకోవడంతో ఇప్పటి నుంచే యువతను, గ్రామస్థులను మచ్చిక చేసుకునేందుకు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. తమ పంచాయతీ, వార్డుల్లో ఏ రిజర్వేషన్ వర్తిస్తుందోనని ఆరాతీస్తున్నారు. గత జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

ఉప ఎన్నికలు లేకుండానే..

గత జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అయితే గడువులోగా ఎన్నికలను నిర్వహించకపోడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇంతకుముందు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిచిన వారిలో కొంతమంది మృతి చెందారు. మరికొంత మందికి ఇతర పదవులు రావడంతో వారు రాజీనామా చేశారు. ప్రత్యేకాధికారుల పాలనకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఉప ఎన్నికలు నిర్వహించలేదు. చనిపోయిన సర్పంచ్‌ల స్థానంలో ఉపసర్పంచ్‌లను నియమించి పాలన కొనసాగించారు. అయితే సర్పంచ్‌ల పదవీకాలం ఐదేళ్లు పూర్తి కావడంతో ఉప ఎన్నికల ఊసేలేకుండా పోయింది.

పంచాయతీ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి..

: మోర్తాడ్ చిన్న గంగాధర్, (భీమ్‌గల్)



గ్రామాల్లో సుమారు నాలుగు నెలల నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. నిధుల లేమీ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి.

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు..

: గంగ మోహన్ (ఎంపీవో)



గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం వచ్చే అవకాశాలు ఉన్నాయి. గ్రామాల్లో ప్రస్తుతం సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

- జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇందల్వాయి, మే 21: జిల్లాలో యాసంగిలో రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యదర్శి డాక్టర్ శరత్ తెలిపారు. ఇందల్వాయిలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న రైతులను అడిగి కొనుగోలుపై సమాచారాన్ని తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4లక్షల 33వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. ప్రభుత్వం ఎంత ధాన్యాన్ని అయినా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందల్వాయి కొనుగోలు కేంద్రంలో 8,691 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు ట్యాబ్ ఎంట్రీని పూర్తి చేసి రైతుల ఖాతాలో డబ్బులను జమ చేస్తున్నామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. సకాలంలో ధాన్యం సేకరించాలని ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంకా 5500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయని ప్రస్తుతం కొనసాగుతున్న 25 కొనుగోలు కేంద్రాల్లో మొత్తం ధాన్యాన్ని కొనే విధంగా చూడాలని ఆయన కోరారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు అయిన పడిగల్, డొంకేశ్వర్‌లో వరి కొంత ఆలస్యంగా రావడం వల్ల ధాన్యం సేకరణ ఆలస్యమైందని ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో మొత్తం కొనుగోళ్లను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తహశీల్దార్‌తో పాటు ఏవో, సొసైటీ కార్యదర్శులను ఉండేలా చూశామని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ ప్రత్యేక అధికారికి వివరించారు. ఇందులో డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్‌లు ఉన్నారు.


మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

'ఇంటర్ సప్లిమెంటరీ'ని పకడ్బందీగా నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్, మే 21: ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో రవికుమార్ సీఎస్, డీవోలను ఆదేశించారు. మంగళవారం నగరంలోని ఖిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సీఎస్, డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాల్లో 18,288 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఇందుకు 15 ప్రభుత్వ, 1 ఎయిడెడ్, 3 రెసిడెన్షియల్ కళాశాలలు, 4 మోడల్ స్కూల్స్, 14 ప్రైవేటు కళాశాలలు, 1 ప్రైవేట్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 11,363 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 6,925 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అదేవిధంగా జిరాక్స్‌సెంటర్లు మూసివేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, 6 సిట్టింగ్ స్క్వాడ్ బృం దాలను, డెక్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రస్థాయి ఇంటర్ బోర్డు స్క్వాడ్ బృందాలు కూడా పరీక్షలను పర్యవేక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు 9గంటలకు ప్రా రంభం కానుండగా విద్యార్థులు 8.30ల లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకొని రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దీన్ అస్లామ్, దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే!



- పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసినా.. ఇంకా లెక్కల్లోనే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు
- క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ తమకు కలిసివస్తుందని అంచనా
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న మూడు పార్టీల నేతలు

నిజామాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతోనే ఉన్నారు. ఎవరికి వారే పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. కొద్దిపాటి మెజార్టీతోనైనా బయటపడతామని వారు భావిస్తున్నారు. తమ అనుచరుల ద్వారా పోలింగ్ సరళిని అంచనా వేసిన వారు కౌంటింగ్‌లో తమకు పూర్తి అనుకూలత వస్తుందని అంచనాకు వస్తున్నారు. తమకు దగ్గరగా ఉన్న వారితో కలిసి లెక్కలు వేసిన వారు గెలుపుపై ధీమాతో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తమకు అన్ని వర్గాలు మద్దతు ఇస్తాయని భావించిన నేతలు పోలింగ్ రోజు విభిన్న వర్గాలు కేంద్రాలకు రావడం వల్ల ఎవరికి వారే ఈ అంచనాకు వస్తున్నారు. సర్వే ఏజెన్సీలతో పాటు నిఘా వర్గాల నివేదిక ఆధారంగా గెలుపుపై అంచనాకు వస్తున్నారు.

పోలింగ్ ముగిసి వారం గడిచినా..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసి వారం రోజులు గడిచిపోయింది. అయినా ఈ పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు మాత్రం ఆగడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎవరికి వారే ఒక అంచనాకు వస్తున్నారు. గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మిగతా ఎన్నికలకంటే భిన్నంగా ఈ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసినట్లు అంచనాకు వస్తున్నారు. ఈనెల 13న పోలింగ్ జరగగా ఆరోజు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నిక కంటే పోలింగ్ శాతం కూడా పెరిగింది. నిజామాబాద్ అర్బన్‌లోనే ఓటర్లు ఈ దఫా ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మైనార్టీ వర్గాలతో పాటు ఇతర వర్గాలు కూడా పార్లమెంట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేశారు. ఈ పోలింగ్‌లో యువత, రైతులు, మహిళలు, వృద్ధులు ఎక్కువ మొత్తంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగతా ఎన్నికల కంటే భిన్నంగా ఎవరికి వారే ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థులు ఎండలను తట్టుకొని సుడిగాలి పర్యటనను జరిపి ప్రచారం నిర్వహించారు. వివిధ వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పూర్తిస్థాయిలో ప్రచారాలను కొనసాగించారు. గ్రామాలకు వెళ్లే అవకాశం లేకపోవడం వల్ల మండల స్థాయిలోనే ఎక్కువగా ఫోకస్ పెట్టారు. తమ పార్టీ నేతలను గ్రామాలకు పంపించి ప్రచారాలను చేశారు. ఎన్నికల ప్రచారానికి భిన్నంగా పోలింగ్ రోజు ఓటర్లు తరలిరావడం వల్ల అభ్యర్థుల్లో అంచనాలు పెరిగాయి.

ఎక్కువగా సైలెంట్ ఓటింగ్

పార్లమెంట్ ఎన్నికల రోజు సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. ఎవరూ ఊహించని విధంగా విభిన్న వర్గాల వారు ఎక్కువ మంది వచ్చి ఈ ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్రాస్ ఓటింగ్ కూడా ఎక్కువ మొత్తంలో జరిగింది. కొన్ని వర్గాలు తమకే వేస్తారని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు భావించిన ఆ వర్గాలు ఎక్కువగా క్రాస్ ఓటింగ్ చేసినట్లు అంచనాకు వస్తున్నారు. పూర్తిస్థాయిలో పోలింగ్ బూత్‌ల వారీగా వివరాల సేకరణ చేపట్టారు. మిగతా ఎన్నికలకంటే భిన్నంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ జరిగినట్లు అంచనాకు వచ్చారు. ఈ ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్, క్రాస్ ఓటింగ్ తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా అంచనా వేశారు. పోలింగ్ జరిగి వారం రోజులు దాటినా ఇప్పటికి ఇంకా నేతలు చర్చిస్తూనే ఉన్నారు. గెలుపుపై మూడు పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు ఇతర ప్రాంతాలకు కుటుంబాలతో కలిసి వెళ్లిన వీటిపైన లెక్కలు వేయడం మానలేదు. ప్రతిరోజు పోలింగ్ సరళిపై చర్చలు జరగడం, ఎవరికి వారే ఈ లెక్కలు వేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల వారు ఈ అంచనాకు వస్తున్నారు. మహిళా ఓట్లు తమకు కలిసివస్తాయని మూడు పార్టీల నేతలు అంచనా వేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు తమకు అనుకూలిస్తాయని కాంగ్రెస్ నేతలు అంచనాకు రాగా మోదీ మానియా పనిచేసినట్లు బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన పనులు ఈ ఎన్నికల్లో తమకు కలిసి వచ్చాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. మొత్తంగా అందరూ గెలుపుపై ధీమాతో ఉన్నారు. సైలెంట్ ఓటింగ్, క్రాస్ ఓటింగ్ కీలకంగా మారడంతో ఈ ఓట్లు ఎవరికి మల్లుతాయోనని పార్టీ క్యాడర్ మాత్రం ఆందోళన చెందుతున్నారు. పెరిగిన పోలింగ్ శాతం కూడా వారు ఎక్కువగా కేంద్రాలకు రావడంతోనే జరగడంతో గెలుపు ఓటములను వారు ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.











కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి, మే 21: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి- రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారిని స్వీట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోత్సవాల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.15430లను దండారూపంలో భక్తులు స్వామి వారి విగ్రహానికి వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభురాంచంద్రం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా భవాని మాతా ఉత్సవాలు ప్రారంభం

బాన్సువాడ, మే 21 : మండలంలోని బుడిమి గ్రామంలో భవాని మాతా ఆలయ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రైతులు ఎడ్లబండ్ల కొరత వలన ట్రాక్టర్లను అందంగా అలంకరించి గుడి చుట్టూ తిప్పారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను ఆలయం వరకు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుందని, రెండో రోజు కల్యాణం, రథోత్సవం, మూడో రోజు కుస్తీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్ పటేల్, తిరుమల్‌రెడ్డి, పెద్దోళ్ళ కాశీరాం, రవీందర్, నాందేవ్, జిన్నా, జగన్ తదితరులు పాల్గొన్నారు.





శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా క్రీడాశాఖాధికారి దామోదర్‌రెడ్డి

వాలీబాల్ క్రీడల్లో మరింత ప్రావీణ్యం సంపాదించాలి

తాడ్వాయి, మే 21: విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో మరింత ప్రావీణ్యం సంపాదించాలని కామారెడ్డి జిల్లా క్రీడాశాఖాధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బ్రహ్మణపల్లిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన కోరారు. క్రీడలు విద్యార్థులకు యువకులకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఒక స్థాయిలో నిలబెట్టడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు క్రీడల్లో తర్ఫీదు చేయాలని సూచించారు. ప్రతిరోజు శిక్షణలో ఉంటేనే క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ పుస్తకాల అమ్మకాలు



అమ్మకాలు జరుపుతున్న పుస్తకాలను చూపుతున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డిటౌన్, మే 21: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గౌతమ్‌మోడల్ స్కూల్‌లో పుస్తకాలను అమ్ముతున్నట్లు ఏబీవీపీ నాయకులు ఖలీల్ అన్నారు.మంగళవారం పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీచేసే పుస్తకాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఆ పుస్తకాలపై గౌతమ్ మోడల్‌స్కూల్ అని ప్రింట్ చేసి మరి అత్యధికంగా డబ్బులను అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. పుస్తకాల అమ్మకాల విషయం ఎంఈవో, డీఈవో దృష్టికి తీసుకుపోయిన స్పందన కరువైందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులైన స్పందించాలని లేకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు.

సూపరింటెండెంట్ శ్రీనునాయక్ సస్పెన్షన్

కామారెడ్డిటౌన్, మే 21: జిల్లా వైద్యఆరోగ్యశాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనునాయక్‌ను సస్పెండ్ చేస్తు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి రవీందర్‌నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని ఓ మెడికల్ ఆఫీసర్‌కు అసభ్యకరమైన మెసేజీలు పంపడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు మెడికల్ ఆఫీసర్లు లైంగిక వేధింపులపై గత రెండురోజుల క్రితం రాష్ట్ర మహిళా కమిషన్‌ను సంప్రదించినట్లు సమాచారం. జిల్లా కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయిస్తారని మెడికల్ ఆఫీసర్లు చూసినప్పటికీ ఎలాంటి పురోగతి కన్పించకపోవడంతో మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. నేడు కామారెడ్డిలో కేసులపై విచారణ అనంతరం గురువారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూను కలిసి జరిగిన సంఘటనపై వివరించినట్లు తెలిసింది.



ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా గణేష్‌నాయక్

గాంధారి, మే 21: మండలంలోని గొల్లడితండాకు చెందిన గణేష్ నాయక్‌కు ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడిగా నియామకపత్రాన్ని ఎస్టీసెల్ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ అందించారు. ఈ సందర్భంగా గణేష్‌నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ శివారు హద్దుల పరిశీలన

బాన్సువాడ, మే 21: మండలం కొల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొంత భాగాన్ని బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామ పంచాయతీ పరిధిలోకి విలీనం చేయడాని కోసం మంగళవారం ఎంపీడీవో బషీరుద్దీన్, బీర్కూర్ ఎంపీడీవో భారతిలు కలిసి కొల్లూరు గ్రామంలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. రైతునగర్ కొల్లూరు గ్రామ శివారులోని భూ భాగాన్ని, గ్రామ శివారులోని హద్దులను పరిశీలించారు. త్వరలోనే రెండు గ్రామాల్లో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సృజన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.





పనికిరాని స్థలం పంచాయతీలకు అప్పగింత


ఎడపల్లి పంచాయతీకి ఇచ్చిన స్థలం

- లే అవుట్లలో పంచాయితీ స్థలంపై ప్రజల అభ్యంతరం
- ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టేదెట్లా
- నాన్ లేఅవుట్ల సంగతేమిటి

ఎడపల్లి, మే 21: ఎడపల్లి మండలం బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై నట్టనడుమ ఉంది. ఇరు పట్టణాల ప్రజలు ఈ ప్రాంతంలో ప్రభుత్వ లేఅవుట్, నాన్ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇట్టి లేఅవుట్ స్థలాల్లో ప్రభుత్వ నిభందనల ప్రకారం కొంత స్థలాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించాల్సి ఉంటుంది. కేటాయించిన స్థలంలో స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం తాగునీటి ట్యాంక్ కాని, అంగన్‌వాడి, పాఠశాల భవనాలు కాని, ఇలా ఏదైన ప్రభుత్వ పరమైన నిర్మాణాలకు ఈ స్థలం వినియోగించాల్సి ఉంటుంది. అయితే పంచాయతీలకు అప్పగించిన లేఅవుట్ స్థలాల భూములలో ఇచ్చిన స్థలం ఎందుకు పనికి రాకుండా ఇష్టారాజ్యంగా ఉంది. దీనిపై స్థానిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు, గ్రామాల ప్రజలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

● ప్రశ్నించేవారు కరువు

లేఅవుట్ లేని స్థలాల్లో ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు కొనసాగుతున్న పట్టించుకోని పంచాయతీ గతపాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం సక్రమంగా చేపట్టిన లేఅవుట్లలో పంచాయతీలకు పనికివచ్చే స్థలాన్ని అయినా తీసుకోవడంలో ఎందుకు ఆసక్తి చూపడంలేదని స్థలకొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లుతీసుకెళ్లినా కూడా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● అంతా మాఇష్టం

ఎడపల్లి మండలంలో ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న అక్రమ, సక్రమ లేఅవుట్ స్థలాల నిర్వాహకులు, యజమానులు, కొనుగోలు చేసిన స్థల యజమానులు, పాలకులు, అధికారులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా అంతా మాఇష్టం అన్న చందంగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

● హద్దులు హుష్‌కాకి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లలో పంచాయతీలకు ఇచ్చిన స్థలానికి పంచాయతీ గతపాలకవర్గం, అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడం వెనుక దాగిఉన్న అంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు. దీంతో అవి రోజురోజుకు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ తతంగం ఎక్కువగా ఎడపల్లి, జానకంపేట్, ఏఆర్పీ క్యాంప్, నెహ్రూ నగర్ గ్రామాలలో వెలుగు చూస్తూనే ఉన్న అక్కడి నేతలు, అధికారులు నోరు మెదపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా మండలంలోని సుమారు 50కి పైగా సక్రమ, అక్రమ లేఅవుట్లు కొనసాగుతున్న వాటిపై పూర్తిస్థాయి నిఘాపెట్టి సక్రమ లేఅవుట్లలో హద్దులతో కూడిన పంచాయతీ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవడం, అక్రమ లేఅవుట్ స్థలాలలో కొనసాగుతున్న పనులను అధికారికంగా అడ్డగించడం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఏఆర్పీ గ్రామంలో అనుమతులు లేని లేఅవుట్

ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తప్పవు



మండలంలో కొనసాగుతున్న అక్రమ లేఅవుట్లపై తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మండల పంచాయతీ అధికారి రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఒకవేళ ఏదైనా అభ్యంతరాలు ఉండి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులకు నివేదికలో ఇచ్చిన స్థలమే మండల గ్రామ పంచాయతీల లేఅవుట్లలో ఒకటై ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేవని, తేడాఉంటే తప్ప కుండా అలాంటివాటి అనుమతులు రద్దుచేస్తామని మండల పంచాయతీ అధికారి రవి ప్రకాష్ రెడ్డి అన్నారు.

-ఇన్‌చార్జీ ఎంపీఓ రవి ప్రకాష్‌రెడ్డి

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి


ఆర్మూర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకెఎస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మే21: ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఏకకాలంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు సారాసురేష్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు ఏపీ గంగారాం, యు.రాజన్న, మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడడానికి వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను 60శాతం సబ్సిడీపై అందజేయాలన్నారు. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయడానికి వెనుకడుగు వేస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రద్దు చేస్తు న్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీలను రద్దు చేసి రైతులపై భారం వేసిందన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు రూ.500బోనస్ ఇచ్చి హామీలను నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజే శారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకెఎస్ నాయకులు రమేష్, గంగాధర్, మల్ల న్న, అశోక్, లింబాద్రి, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని మాస్‌లైన్ నాయకులు అన్నారు. మంగళవారం మోర్తాడ్ మండల కేంద్రంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కిషన్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, మినీట్రాక్టర్‌లు సబ్సిడీపై ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కేవలం జలుము, జీలుగు పంపిణీ చేయడమే గాక అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు 50శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. బ్యాంకు అప్పులు తీసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకాన్ని వర్తింపజేశాయని, కేంద్ర ప్రభుత్వం ఫసల్‌బీమా అందరికి అని చెప్పి కొందరికి మాత్రమే వర్తింపజేస్తున్నాయని ఆరోపించారు. బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో సర్వేచేసి పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సురేష్, నాయకులు సత్తెక్క, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఝార్ఖండ్‌లోని వశిష్ట గుహ ఆశ్రమానికి చేరుకున్న భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు


ఝార్ఖండ్ వశిష్ట గుహ ఆశ్రమంలో ఉన్న భూమ యోగేశ్వర ఆశ్రమ సభ్యులు

నందిపేట, మే21: నందిపేట మండలంలోని కొల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ పరమహంస భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు మంగళవారం ఝార్ఖండ్ రాష్ట్రంలోని వశిష్ట గుహ ఆశ్రమానికి చేరుకున్నారు. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో కొల్‌పూర్ టూ బద్రీనాథ్‌కు పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. పాదయాత్ర 59వ రోజుకు చేరుకుంది. వశిష్ట గుహ ఆశ్రమం నుంచి మళ్లీ బద్రీనాథ్‌కు పాదయాత్ర చేపట్టినట్లు భక్తులు తెలిపారు. ఈ పాద యాత్రలో ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ దంపతులు, అలాగే భక్తులు గజ్జెల సత్యనారాయణ, ఎంబేరు నర్సయ్య, వన్నెల్‌దాస్ పార్థసారథి, ఎంబేరు సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డులను నిర్వహణలోకి తీసుకురావాలి


చింరాజ్‌పల్లిలో పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిస్తున్న ఆర్మూర్ డీఎల్‌పీవో

నందిపేట, మే21: గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను నిర్వహణలోకి తీసకురావాలని ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నందిపేట మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామాన్ని డీఎల్‌పీవో శివకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులను, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. అవసరం మేరకే నిధులు ఖర్చు చేయాలని, నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఎల్‌పీవో ఆదేశించారు. రానున్న రోజుల్లో నల్లాలకు లీకేజీలు లేకుండా, మురికి కాల్వలను శుభ్రంగా ఉంచి, క్లోరినేషన్ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోరె కిరణ్ కుమార్, కార్యదర్శులు ప్రశాంత్, సాయికుమార్, కారోబార్ నంబూద్రి ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వర్మి కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలి


నడిపల్లిలో వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్న సిబ్బందిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, మే 21: ఒక వైపు పన్నుల వసూళ్లతో పాటు మౌలిక సమస్యల పరిష్కారానికి చేయూతనందిస్తున్న పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డులలో వర్మి కంపోస్ట్ ఎరువులను తయారు చేసి రైతాంగానికి అందించడం వల్ల పంచాయతీలు ఆర్థికంగా బలోపేతంగా తయారుఅవుతాయని ఎంపీడీవో రవీందర్ , ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ లు సూచించారు. మంగళవారం నడిపల్లి గ్రామంలో సేంద్రీయ ఎరువుల తయారీ విధానం పరిశీలించిన ఎంపీడీవో , స్థానిక ఈవో నిట్టు కిషన్ రావు ను అభినందించారు. పంచాయతీ కార్యదర్శులు వర్మి కంపోస్ట్ తయారీ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

24న జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

జక్రాన్‌పల్లి, మే21: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24 తేదీన ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం పరిశీలన

మోర్తాడ్, మే21: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి ముత్తెన్న సందర్శించారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామంలో శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు తగు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనే విధంగా విద్యార్థులకు శిక్ష అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ ను అభినందించారు. క్రీడాకారులకు క్రీడా పరికరాలను ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్, క్రీడాకారులు ఉన్నారు.

గ్రామ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


కోటగిరిలో మాట్లాడుతున్న డీపీఓ తరుణ్ కుమార్

కోటగిరి,మే21: గ్రామాలలో సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ హెచ్చరించారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీని మంగళవారం డీపీవో తనిఖీ చేశారు. గ్రామంలో పలు కాలనీలను సందర్శించారు. పారిశుధ్య సమస్య అధ్వానంగా ఉండడంపై కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ, కంపోస్ట్ షెడ్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల వారిగా పన్నుల వసూళ్ల వివరాలు తెలుసుకున్నారు. వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నర్సరీలు, కంపోస్ట్ షెడ్డులు, ఇతరత్రా పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవోలు మారుతీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి


చలో బస్‌భవన్‌కు బయలుదేరుతున్న ఆర్మూర్ ఆర్టీసీ యూనియన్ సభ్యులు

పెర్కిట్, మే21: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో బస్ భవన్ కార్యక్రమానికి ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి అధ్యక్ష, కార్యదర్శులు రవిచందర్, రమేష్, సభ్యులు మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రి యను వెంటనే పూర్తి చే యాలని, చట్టం ప్రకారం టీఎస్ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్‌లను పునరు ద్ధరించాలని అదే విధంగా 2013 ఆర్‌పీఎస్ బాండ్ డబ్బులను వెంటనే అం దరికి చెల్లించాలని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఖాళీలన్నింటిని భర్తీ చేసి పని భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుజాత, సుమలత, భూమన్న, గంగవ్వ, జ్యోతి, లత, శీను, హరి, రవీందర్, గంగాధర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బడా కార్పొరేటర్లకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటు



సాలూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బోదన్‌రూరల్,మే21: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సబ్సిడీ రద్దు చేసి బడా కార్పొరేటర్లకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు పండించడానికి సమాయత్తం అవుతున్నారని, రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. యంత్ర పరికరాలను, మిని ట్రాక్టర్లను సబ్సిడీపై ఇవ్వలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు సీహెచ్.గంగారాం, లచ్చరాం, లక్ష్మీబాయి, రాజన్న, సరస్వతి, లక్ష్మి, గంగయ్య, లక్ష్మణ్, రాజన్న, దత్తు, సంజీవ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నవీపేట,మే21: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన మంగళవారం అమ్మవారి కల్యాణం, సర్వాయి వేయుట, అఖండ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి బోనాల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి జయంతి


మోస్రాలో నరసింహస్వామి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మోస్రా,మే21: మండల కేంద్రంలోని మాసం చెరువు కట్ట వద్ద గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరాన్ని సుందరంగా పూలమాలతో సీరియల్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. గర్భగుడిలో స్వామి వారి విగ్రహాన్ని అభిషేకం చేసి పట్టుబట్టలతో పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణలో సత్యనారాయణ పూజ నిర్వహించారు. భక్తులకు ప్రసాదం వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సంతోష్, సుధీర్, వివిధ పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మి నర్సింహస్వామి జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేణు తెలిపారు. జయంతిలో భాగంగా ఉదయం ఏడు గంటలకు చందన అభిషేకం, 10 గంటలకు స్వామివారికి,అమ్మవారికి తిరు నక్షత్ర కల్యాణము, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పల్లకిసేవ, ఆ తరువాత స్వామి వారికి సేవలు నిర్వహించడం జరుగతుందని, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి జన్మోత్సవ వేడుకలలో పాల్గొనాలని ఆయన కోరారు

ఆర్మూర్‌రూరల్: కమ్మర్‌పల్లి మండల కేంద్రలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం వేదమంత్రోత్సరణలమధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగ నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటి అధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శివశర్మ వేదమంత్రాలమధ్య ఘనంగ జరిపించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనగణనతో పాటు కుల గణన చేపట్టాలి

ముప్కాల్, మే21: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో జనగణనతో పాటు కుల గణన నిర్వహించాలని మహాత్మ గాంధీజ్యోతిరావుపూలే ప్రధాన కార్యదర్శి బీమన్‌పల్లి విఠోభ డిమాండ్ చేశారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అందులో బీసీలకు దామష ప్రకారం రిజర్వేషన్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రంలో మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు మండల కమిషన్ సిఫారసు మేరకు అమలు చేయాలన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో బీసీలకు ప్రకటించిన న్యాయమైన కోరికలను అమలు చేయాలని, అమలుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజికంగా ఆర్థిక, రాజకీయంగా అన్ని రంగాల్లో బీసీలకు మరిన్ని ప్రోత్సహకాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాస శ్యామ్, బండి మల్లేష్, కొత్తింటి సాయన్న, మదర్, సురేష్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బోధన్‌రూరల్,మే21: ప్రొఫెసర్ జయశంకర్‌ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సరిగాధ పరమేశ్వర్ ఆచార్య అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో విశ్వకర్మ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రహ్మణ విద్యార్థి, విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వస్ఫూర్తి ప్రతిభ పురస్కారాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగావిచ్చేసిన డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న విద్యార్థులందరు భవిష్యత్‌లో బాగా చదివి మంచి ఉద్యోగాలను సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్, రాఘవపురం గోపాలకృష్ణ ఆచార్య, కిరణ్‌కుమార్, మురహరి, శ్రీను, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సాయేందర్, శ్రీధర్, లక్ష్మినారాయణ, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు జనార్ధన్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీనియర్, అండర్-19 క్రికెట్ ఎంపికలు

సుభాష్‌నగర్,మే21: అండర్-19,సీనియర్ క్రికెట్ ఎంపికలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. నగరంలోని జీజీ కళాశాల మైదానంలో ఉదయం 7గంటల నుంచి ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పదవ తరగతి మెమో, ఆధార్‌కార్డ్, తెల్లని దుస్తులు, క్రికెట్ కిట్‌ను వెంట తీసుకొని రావాలని కోరారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు అందజేయాలి

నవీపేట,మే21: మండలంలోని వివిధ గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేయాలని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో 10సంవత్సరాల క్రితం ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేయగా తర్వాత ఇప్పటి వరకు ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి పనిముట్లు అందజేయలేదని అన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు నిర్వహించే చోట కూలీలకు నీడ ఏర్పాటు చేయాలని, పనులు జరిగే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్, భూంరావు, అబ్బన్న, సునీల్, లక్ష్మణ్, రాజశేఖర్, గంగాధర్ తదితరులున్నారు.


ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

రుద్రూరు,మే 21:సెల్‌ఫోన్‌ను పొగొట్టుకున్న వ్యక్తులకు ఎస్‌ఐ అప్పారావు రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌లను మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌లు పొగొట్టుకున్న బాధితులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసుకుని వెంటనే ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అంద జేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

పైప్‌లైన్‌ను పరిశీలన

ఆర్మూర్‌టౌన్,మే21: మిషన్ భగీరథ పైప్‌లైన్ చెడిపోవడంతో మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం పైప్‌లైన్‌ను పరిశీలించారు. బాల్కొండ మండల కేంద్రంలో లింగమయ్య గుడి వద్ద గల మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమై లీకేజీ కావడంతో మున్సిపల్ పరిధిలో నీటి సమస్య తలెత్తింది. దీంతో ఆయన పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్స్‌పెక్టార్ నవీన్, తదితరులు ఉన్నారు.

అర్గుల్‌లో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే21: మండలంలోని అర్గుల్ గ్రామంలో మైనారిటీ గుట్టపై మూడు రోజుల నుంచి ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉర్సు ఉత్సవాలు జరగగా సోమవారం ఘనంగా జరిగాగ మంగళవారం మైనారిటీ గుట్టపై కవాలి కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మైనారిటీ గుట్ట వద్ద భక్తుల కోసం మూడు రోజుల పాటు అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాలను గురువు ముజీబ్‌అన్సరీ ఆధ్వర్యంలో జరిగయని మైనారిటీ పెద్దలు తెలిపారు. మంగళవారం ఉర్సు ఉత్సవాలు ముగిశాయని మైనారిటీ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురువు ముజీబ్‌అన్సరీ, మైనారిటీ పెద్దలు బడేమియా,పాషా,ఇంతిసరోద్దిన్,ఫారూఖ్,తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సంవత్సరం మన మైదానంలోనే శిక్షణ

● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్


మాట్లాడుతున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు

సుభాష్‌నగర్,మే 21: వచ్చే ఏడాది జిల్లాలో స్వంతంగా నిర్మంచిన స్టేడియంలోనే శిక్షణ శిబిరం నిర్వహించేలా కృషి చేస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది ప్రతిభవంతులైన క్రీడాకారులు ఉన్నారన్నారు. ఇందుకు నిదర్శనం బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న నిఖత్‌జరీన్, హుసామోద్దీన్‌లు అని తెలిపారు. జిల్లాలో సమ్మర్‌క్యాంపులు కాకుండా రెగ్యులర్ క్యాంపులుగా నిర్వహించేందుకు ఇక్కడే అధ్యక్ష,కార్యదర్శులు కృషి చేయాలన్నారు. దానికి హెచ్‌సిఏ తరఫున తోడ్పాడు అందిస్తామన్నారు. తెలంగాణా జిల్లాలో రంజీలు నిర్వహించేలా హెచ్‌సిఏ కృషి చేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో ఐదెకరాల స్థలంలో మంచి స్టేడియాన్ని నిర్మించవచ్చని మరో నాలుగు,ఐదెకరాలు తీసుకుంటే అధు నాత స్టేడియాన్ని నిర్మించవచ్చని అందుకు అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఏ కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్, నిజామాబాద్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేష్‌బాబు, పారస్ వినోద్, సీనియర్ క్రికెటర్లు లలిత్‌రెడ్డి, సూరజ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



అమెరికాలో ఎన్ఆర్ఐలతో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే21: ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి ప్రవాస భారతీయులు సహకరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీ నగరంలో మంగళవారం ఎన్ఆర్ఐ, బీజేపీ నాయకులు ఇతర ఎన్ఆర్ఐలతో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ నియోజకవర్గంలోని గ్రామాలాభివృద్ధికి ఎన్ ఆర్ఐలు ముందుకు రావాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు పరి శ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాలన్నారు. ఈ విషయంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా సహకారం అందేలా చూస్తామని రాకేష్‌రెడ్డి తెలి పారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను సమా వేశంలో ప్రవాస భారతీయులకు వివరించారు.

నగరంలో భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● ఓవర్ లోడ్‌కు చెక్



నగరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 21: గత కొన్ని రోజులుగా వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఓవర్ లోడ్‌తో చీటికి మాటికి కరెంట్ పోతుంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఓవర్ లోడ్‌కు చెక్ పెట్టేందుకు భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మొట్టమొదటగా జిల్లా కేంద్రంలో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల కాలనీలకు కరెంట్ కటకటా తీరనుంది. ఉదయం నుంచి విద్యుత్ శాఖ అధికారులు శ్రమించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్, డీఈలు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావులు పర్యవేక్షించారు. ఏర్పాటులో స్వామి, ఏడీఈలు వీరేశం, తోటరాజశేఖర్, చంద్రశేఖర్, సయ్యద్, గంగారాం, భరత్, బాబురావు, రఘునందన్, రాజేందర్, నాగరాజు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కార ణంగా డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గాయస్ షైమద్ తెలిపారు. మంగళవారం నూత్‌పల్లిలోని సబ్‌స్టేషన్‌లో రిన్యువేషన్ మరమ్మత్తులకు అయ న దగ్గరుండి పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మ తులు చేపడుతున్నందున పది రోజుల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ఇందుకు విని యోగదారులు సహకరించాలని కోరారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి, నడ్కుడ, గాదేపల్లి, చిన్న యానం గ్రామాలలో ఉదయం 7నుంచి 12గంటల వరకు మరమ్మత్తులు కొనసాగుతాయని పది రోజుల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



మోతెలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

వేల్పూర్, మే21: మండలంలోని మోతె, పడిగెల్, వేల్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారి నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30కిలోల జీలుగ బస్తాకు రూ.2790 ఉండగా 60శాతం పోను రూ.1116 అందించడం జరుగుతుందన్నారు. ఒక బస్తా జీలుగ విత్తనాలు రెండున్నర నుంచి మూడు ఎకరాల వరకు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సీఈవోలు రాజేష్, కృష్ణ, మోహన్, ఏఈవో షబ్బీర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలో బుధవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ తెలిపారు. మండలంలోని రామడుగు, ధర్పల్లి సింగిల్ విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. 30 శాతం సబ్సిడీతో ఈ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. పట్టపాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్సులు రైతులు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

డిచ్‌పల్లి: రైతులు వ్యవసాయ పంట పొలాల్లో జీలుగ విత్తనాలు వేసుకొని అధిక పంట దిగుబడులు పొందాలని డిచ్‌పల్లి సొసైటీ ఛైర్మన్ రాంచందర్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఘన్‌పూర్ సహకార గోదాంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గంగారం,డైరెక్టర్‌శాంసన్,సతీశ్‌రెడ్డి, సీఈవో కిషన్, పాల్గొన్నారు.

నవీపేట: నవీపేట, బినోలలో మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. నవీపేట, బినోల సొసైటీల ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలు అందజేశారు. నవీపేటలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మహేష్, రాము, శ్రీనివాస్, మోస్రా సాయిరెడ్డి, గోపాల్ ఉన్నారు. బినోలలో జరిగిన కార్యక్రమంలో బినోల సొసైటీ కార్యదర్శి రమేష్, ఛైర్మన్ హన్మాండ్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు..యువత చిత్తు

● వినియోగిస్తున్న వారిలో పాతికేళ్ల లోపు వారే అధికం

కోటగిరి,మే21: గంజాయిని ఎంతగా అరికట్టాలని జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తున్న అంతకు రెట్టింపుగా సరఫరా అవుతుంది. చాప కింద నీరులా ఈ వ్యాపారం సాగుతుంది. మత్తుకు యువతే ఎక్కువగా బానిసవుతోంది. గత ఏడాదిగా జిల్లాలో పలు ప్రాంతాలలో గంజాయి కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. పట్టుపడుతున్న వారిలో యువతే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. చాలా మంది తల్లిదండ్రులు తమ కుమారులు గంజాయికి బానిసయ్యారని తెలిసిన బయటకు తెలిస్తే పరువు పోతుందని లోలోన మదన పడుతున్నారు.

● వ్యవస్థల బలోపేతంతోనే నియంత్రణ

గంజాయి మత్తు ప్రభావం లేని గ్రామం లేదంటే ఆశ్చర్యం లేదు. మహమ్మారిని తరిమి కొట్టాలంటే గ్రామాలలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. గ్రామంలో గంజాయికి ఎవరెవరు బానిసలయ్యారో వారికి ఎక్కడ నుండి ఎవరి ద్వారా గంజాయి సరఫరా అవుతుందన్న వివరాలు సేకరించాలి. పోలీసు స్టేషన్‌ల వారిగా ఈ మత్తు దందాలోని వ్యక్తుల వివరాలు సేకరించాలి. నెలకోసారి సమీక్ష నిర్వహించి పదేపదే పట్టుబడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

● జిల్లాలో జోరుగా సరఫరా

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గంజాయి సరఫరా జోరుగా జరుగుతోంది. మండల కేంద్రాలు మొదలుకుని మారుమూల గ్రామాలకు సైతం పాకింది. గ్రామాల్లోని యువత దీనికి ఎక్కువగా బానిస అవుతున్నారు. యువతకు ఉచితంగా అందజేసి అలవాటు చేస్తున్నారు. చివరకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో వారే విక్రయ మార్గాలను ఎంచుకుంటున్నారు. వ్యాపార ప్రాంతాలలో, దుకాణాల్లో వీటి విక్రయాలు సాగుతున్నాయి. ఇంట్లో వారికి ఏ మాత్రం అనుమానం రాకుండా తెప్పించుకుంటున్న కొందరు యువకులు పట్టణ శివారు, గ్రామాలలో నిర్మానుష ప్రాంతాలు, చిన్న చిన్న గుట్టలు ఉన్న ప్రాంతాలకు వెళ్లి మత్తులో తూలుతున్నారు. తొలుత సరదాగా ప్రారంభమైన వాడకం



హెగ్డోలిలో విచారణ జరుపుతున్న ఏసీపీ శ్రీనివాస్(ఫైల్ ఫోటో)

చివరికి వ్యసనంగా మారుతుంది. కోటగిరి ఉమ్మడి మండలంలో మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన సంఘటనలే ఇందుకు ఉదాహరణం మారింది. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామ పంచాయతీ పరిధిలో గల బాకర్‌ఫారం గ్రామంలో మార్చి 23వ తేది ఓ వ్యక్తిని గంజాయి మత్తులో దారుణంగా కొట్టడంతో చికిత్స నిమిత్తం తరలించగా మార్గమధ్యంలో మృతి చెందారు. రంగనాయకులు ఫారంలోనూ ఓ వృద్ధురాలిపై గంజాయి మత్తులో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఆమె వద్ద ఉన్న బంగారు నగల కోసమే హత్య చేసినట్లు తెలిసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ జరుపగా విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. బకార్‌ఫారంకు చెందిన ఓ యువకుడు మత్తుకు బానిసై ఈ అఘాయిత్యాలకు ఒడిగట్టినట్లు తెలిసింది. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు. ఆయా గ్రామాల్లోనూ యువత పెద్ద ఎత్తున గంజాయిమత్తుకు అలవాటు పడినట్లు తెలిసింది. గంజాయితో పాటు బైక్ రేసింగ్, పేకాట వంటి వ్యసనాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను వృథా చేసుకుంటున్నారు. ఈ ఘటనలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి యువత మత్తుకు బానిస కాకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల పరిశీలన



నిశిత పాఠశాలను పరిశీలిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు

నిజామాబాద్ అర్బన్, మే 21: నగరంలో నూతనంగా నిర్మిస్తున్న నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలను, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించారు. విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రతీ ఒక్కరు రాణించాలని క్రీడల్లో ఆడ మగ తేడా ఉండవద్దన్నారు. క్రీడలకు 51 శాతం, విద్యకు 49 శాతం ప్రాముఖ్యత ఉంటుందన్నారు. క్రీడల్లో ఎవరైతే తమ ప్రతిభను చూపిస్తారో వారే కాకుండా ఓడిన క్రీడాకారులు కూడా జీవితంలో ఎలా ముందుకు పోవాలనేది క్రీడల ద్వారా నేర్చుకుంటారన్నారు. పిల్లలను మానసికంగా, శారీరకంగా దృడంగా తయారు చేయాలన్నారు. నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల విశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా నిశిత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన వెంట హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజు, హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్, నిశిత డిగ్రీ కళాశాల చైర్మన్ నిఖిల్, కోఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ ఓంశేఖ్, ప్రిన్సిపల్ స్వప్న, నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్‌ఖౌర్‌మోదీ, తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నిజామాబాద్ అర్బన్, మే 21: దివంగత నేత, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి ఎన్నో సేవలు చేశారని సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందిందంటే దానికి రాజీవ్‌గాంధీ చేసిన సంస్కరణలే ప్రధా న కారణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి రామకృష్ణ, ఈసా, రేవతి, ప్రమోద్, కేశరాజు, పోల ఉషా, విజయలక్ష్మి, మల్లేష్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని ఎంపీటీసీ కొట్టం మనోహర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వహీద్, గంగాధర్ దేశాయ్, సునీల్ కుమార్, శివరాజ్ దేశాయ్, హన్మంత్, బర్ల మధు తదితరులు పాల్గొన్నారు



నగరంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

మహిళ సంఘాలు ఆర్థికంగా బలోపేతం చెందాలి

● డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్



టీటీడీసీలో మాట్లాడుతున్న పీడీ సాయాగౌడ్

డిచ్‌పల్లి, మే 21: 2023-24 సంవత్సరంలో బ్యాంక్ లింకేజీలో 100శాతం లక్ష్యం పూర్తి చేయడం అందరి సహకారంతోనే పూర్తి అయిందని, ఈ ఆర్థిక సంవత్సరం 1032.74 కోట్ల లక్ష్యం పూర్తి చేసేందుకు కలిసి కట్టుగా శ్రమించాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపీఎం లు, సీసీలు సిబ్బందికి టీ సెఫ్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి పీడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. స్త్రీనిధి ద్వార 2023-24 ఏడాది కి లక్ష్యాన్ని పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆడిట్ మే 23 నుంచి 28 వరకు పూర్తి చేసి జూన్ 4న రిపోర్టు సబ్మిట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్రంలోనే జిల్లా అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉన్నందుకు సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ఎస్ఎల్‌జీ వీవోల ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో నిర్దేశిత సమయంలో ఎంటర్ చేసి సంఘాలను ఏ గ్రేడ్ లో ఉండేలా సిబ్బంది చూడలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు కీలక బాధ్యతలు మహిళ సంఘాలకు అందించారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రవీందర్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

తిర్మన్‌పల్లిలో ఉపాధి పనుల పరిశీలన

నిజామాబాద్ రూరల్, మే, 21: రూరల్ మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో మధురిమ పరిశీలించారు. మంగళవారం మండలంలోని తిర్మన్‌పల్లి, పాల్డ, జలాల్‌పూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలతో కాల్వ మరమ్మత్తులు, కాల్వల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగింపు, కాల్వల్లో పూడిక తీత వంటి పనులు చేయిస్తున్నట్లు ఎంపీడీవో మధురిమ తెలిపారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

● 429మంది విద్యార్థులు గైర్హాజరు



డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్‌యాదగిరి

డిచ్‌పల్లి, మే 21: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్, పరీక్షలుఉదయం 1,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని 38పరీక్ష కేంద్రాల్లో జరిగిన రెగ్యులర్ పరీక్షలకు 8931 అభ్యర్థులకు గాను 8534 మంది హాజరుకాగ 398 విద్యార్థులు గైర్హాజరయ్యారని, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 386 మంది విద్యార్థులకు గాను 354 పరీక్షకు హాజరయ్యారని, 32మంది విద్యార్థులు ఈపరీక్షలకు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 4ప్రత్యేక స్క్వాడ్ బృందాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, నిజామాబాద్, కామారెడ్డిలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నల్లవెల్లిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నల్లవెల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఇందల్వాయి, మే 21: ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు నల్లవెల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమం నిర్వహించారు. ఈ ఉత్సవాలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రథోత్సవం, శుక్రవారం చక్రతీర్థం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు బోనాల నాగరాజు, నటకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలి '

డొంకేశ్వర్, మే21: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌లు ప్రకటించిన తర్వాతనే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక జనాభా 42శాతం కలిగిన బీసీలను గుర్తించి రిజర్వేషన్‌లను ప్రకటిం చాలని అన్నారు. రిజ్వషన్‌లు ప్రకటించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించకుండా అన్యాయం చేసిందని, 34శాతం రిజర్వేషన్ కలిగి ఉంటే 20శాతం రిజర్వేషన్ చేసిందని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పిన విధంగానే బీసీ రిజర్వేషన్‌లను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు విరాళం అందజేత



ఏర్గట్లలో విరాళం అందజేస్తున్న విడీసి సభ్యులు

ఏర్గట్ల, మే 21: మండల కేంద్రంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకై మంగళవారం వీడీసీ ఆధ్వర్యంలో రూ. 11116లు అలాగే గ్రామానికి చెందిన బర్మ నిఖిల్ రూ. 20వేలు గ్రామంలోని యూత్ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కారుపాకల నర్సయ్య, ఉపాధ్యక్షుడు బంటు ప్రశాంత్, క్యాషియర్ సోమ లింగారెడ్డి, బర్మ నరేష్, విడీసి సభ్యులు, పలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, మే21: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లి వేంకటేశ్వరకాలనీలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభయ్యాయి. మంగళవారం ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, పుణ్యాహవచనం నిర్వహించారు. 22న అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, బలిహరణం, 23న శ్రీవారి తిరుకల్యాణం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

29 నుంచి స్థాయీ సంఘ సమావేశాలు

ఖిల్లా ,మే 21: ప్రతీ మూడు నెలలకొకసారి నిర్వహించే స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 29నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య నిర్వహణాధికారి బి.ఉషా తెలిపారు. ఈ సమావేశాలను జిల్లా పరిషత్ భవనంలోని స్థాయి సంఘ సమావేశహాల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ అధ్యక్షత వహిస్తారన్నారు. 29న ఉదయం 10గంటలకు గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. 11గంటలకు వ్యవసాయం దాని అనుబంధ శాఖలపై సమీక్షతో పాటు మహిళ, శిశు సంక్షేమం శాఖలపై సమీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు విద్య, వైద్యం శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. 30న ఉదయం 11గంటలకు సాంఘిక సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళిక శాఖలపై సమీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షలకు సంబంధిత శాఖల అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

డిచ్‌పల్లి, మే 21: రైతులు అధిక దిగుబడులు పొందేందుకు సమీకృత పోషన యాజమాన్యాలను తప్పక పాటించాలని రైతు వేదిక మెంట్రాజ్‌పల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతాంగానికి అవగాహన కల్పించారు. రైతులు సనాతన పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించలన్నారు. వరి మొదళ్లు దహనం చేయడం వల్ల ఏలాంటి ప్రయోజనం ఉండదని, రైతులు ఆ పద్ధతులు ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాంబాబు, విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

సెర్చ్ కమిటీ పేరుతో కాలయాపన సరికాదు

డిచ్‌పల్లి, మే 21: రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీ పేరు మీద కాలయాపన చేయడం సరైంది కాదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. వర్సిటీలకు వీసీలనియామకానికి సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిన ఇంకా ఇన్‌చార్జ్ వీసీలను పెట్టడం యూనివర్సిటీల అభివృద్ధిని అడ్డు కోవడమేనని విమర్శించారు. కాలయాపన చేయడం వల్ల వైస్ చాన్స్‌లర్ నియామకం హేతు బద్ధంగా జరిగే అవకాశాలు లేవని రెగ్యులర్ వీసీలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.